
కథ

# చిన వెంకట శాస్త్రి

కంచిరాజు రత్నమాల



ఇల్లంతా చాలా కోలాహలంగా వుంది. దసరా పండుగల్లో ఆరోజు ఆఖరి రోజు విజయదశమి. మా ఇల్లే కాదు- ఊరంతా చాలా సందడిగా వుంది. ఊళ్లో వున్న శివాలయం, అమ్మవారి గుళ్లల్లో నుంచి మైకులు తారాస్థాయిలో వినిపిస్తున్నాయి. పల్లెటూరు కదా మైకులకు కంట్రోలు ఏమీ వుండదు.

మేమంతా దశమినాడు రాత్రి అమ్మవారి గుడికెళ్లి అమ్మవార్ని దర్శించుకొని, జమ్మిచెట్టుకి 'శమి శమియతే పాపం, శమిశత్రు వినాశనం, అర్జునస్య ధనుర్ధారి-రామశ్య ప్రియదర్శనం' అనే చీటిలో మా సంతకాలు చేసి ఆ చీటిని చెట్టుకి గుచ్చి వస్తాం.

మా శ్రీవారిది పశ్చిమగోదావరి జిల్లాలోని చిన్న కుగ్రామం. ఇప్పటికీ కూడా ఆ ఊరుకి ఆర్టీసీ బస్సుగాని, ప్రైవేట్ బస్ గానీ వెళ్లదు.

చాలా మందికి ఇంకా సైకిళ్లే. ఆ ఊళ్లో కొద్దిమందికి స్కూటర్లు, ఒకళ్లిద్దరికి చిన్న కార్లు వున్నాయి. చాలా మంది మట్టిరోడ్డులో నడిచే పక్కనున్న టౌన్‌కి వెడతారు. తప్పితే రిక్షాలో వెడతారు.

అలాంటి చిన్న ఊళ్లో దసరా ఉత్సవాలు అద్భుతంగా చేస్తారు. విజయదశమినాడు రాత్రి అమ్మవార్ని చాలా కోలాహలంగా ఊరేగిస్తారు. అమ్మవారి రథానికి ముందుగా బ్యాండ్ మేళం, వెనుకగా ఎడ్లబండ్లు వాటి మీద అర్ధనారీశ్వర- ఆంజనేయస్వామి, వారే కాకుండా రకరకాల దేముళ్ల వేషాలు, మిగిలిన బండ్ల మీద భోగం మేళం, బాణా సంచా వాళ్లు, ఊరేగింపు రసవత్తరంగా సాగుతుంది.

సినిమా పాటలు, బ్యాండ్‌మేళం బాణాసంచా మొత్తం మూడు సౌండ్‌లు కలిసి ఒక పాత సౌండ్‌లా వినిపిస్తుంది. ఆ ఊరేగింపు మా గుమ్మం దగ్గరకు వచ్చేసరికి అర్ధరాత్రి దాటిపోతుంది. ఆ టైమ్ దాకా మేము కబుర్లతో, కథలతో కాలక్షేపం చేస్తాము.

మావారికి ముగ్గురు అన్నయ్యలు. ఒక తమ్ముడు ఉన్నారు. మేము ఒక్కళ్లమే ఉద్యోగరీత్యా టౌన్‌లో ఉంటాము. మిగిలిన నాలుగు కుటుంబాలతో సరదాగా గడపడం కోసం ప్రతి సంవత్సరం దసరా శలవులకి ఆ ఊరు వెడతాము. మేమే కాదు ఆ ఉత్సవం చూడడానికి పక్క ఊళ్ల నుంచి జనం లారీల మీద, ట్రాక్టర్లు, ఎడ్లబండి మీద వస్తారు. ఏడాదికి ఒకసారి మా బిజీ షెడ్యూల్ నుంచి, కాంక్రీట్ అడవి నుంచి బయటకు వచ్చి పచ్చని పొలాలు, కాలువల మధ్య మా వాళ్ల మధ్య గడపడం, అమ్మవారి ఉత్సవాలను చూడడం, ఇవన్నీ మాకు చాలా ఇష్టమైన విషయాలు.

మా పిల్లలయితే వాళ్ల డాడీ, పెద్దనాన్నలు వాళ్ల చిన్నప్పుడు జరిగిన విషయాలు కథలు కథలుగా చెపుతూ వుంటే నోరు వెళ్లబెట్టుకొని వింటారు. చిన వెంకటశాస్త్రి అని ఈ ఊరి మొదటి ప్రెసిడెంట్ ఈ ఉత్సవాలు ప్రారంభించాడు అంటూ, చిన వెంకట శాస్త్రి గురించి మా పెద్ద బావగారు చెప్పడం మొదలు పెట్టారు. ఆయన మాటల్లోనే ఈ కథ విందాము.

అప్పటికింకా స్వతంత్రం రాలేదు. నేను ఎలిమెంటరీ చదువు పూర్తిచేసుకొని హైస్కూలుకి వెళతున్న రోజులవి. పల్లెటూర్లు చాలా అధ్వాన్నంగా వుండేవి. ఊరికి మూడు పక్కలా గోనీ నది. ఒక పక్కగా రావి చెట్టు. అదీ పొలాల్లోంచి హైస్కూలుకి వెళ్లాలంటే దోనె దాటి వెళ్లాలి. వాన పడిందంటే వూళ్లో నుంచి దోనె వరకు బురదలో నడిచి కాలవలో కాళ్లు కడిగి దోనె ఎక్కాల్సిందే. కాలువలోకి వరదనీరు బాగా వస్తే దోనె వేసేవాడు కాదు. ఆ రోజు స్కూలుకి ఇంక హుళక్కే...సైకిళ్లతో సహా మనుషులు, మేకలు, గొర్రెలు, గేదెలు ఒకటేమిటి ఏది మా ఊరు దాటాలన్నా ఆ దోనె మీదే. ఎందుకంటే కాలి బాటలో వెళ్లాలంటే ఐదు మైళ్లు నడిస్తేనే గాని టౌన్ రాదు. ఊళ్లో నుంచి మైలు దూరం నడిచి దోనె ఎక్కి అవలి పక్క దిగగానే టౌన్ వచ్చేస్తుంది.

గోదావరీ పరివాహక ప్రాంతమేమో పంటలు పుష్కలంగా పండేవి. ఊరు నిండా డబ్బున్న రైతులే. వారి పిల్లలు వ్యవసాయం పనులలో తండ్రులకు సాయం చేసినా మిగిలిన టైమ్ అంతా ఎక్కువ జల్సాగా గడిపేవారు. ఆ ఊరంతా ఎక్కువగా రెడ్లు, రాజులు. వీళ్ల పిల్లల మధ్యే పందాలు, పోటీలు. ఎడ్లు, కోళ్లు, గొర్రెల పందాలు, చీట్ల పేకలు వాళ్ల ఇష్టం. ఎప్పుడు ఏ పందెం ఎవరి మీద కాస్తారో వాళ్లకే తెలియదు. పండుగరోజులు ధాన్యం ఇళ్లకి చేరాయి. చలి రాత్రుళ్లు- వెచ్చటి పగళ్లు.

ఆ రోజు ముక్కనుమ.పెదరెడ్డి గారి గొర్రె, సర్పంచ్ రామరాజుగారి గొర్రెకి పోటీ. పల్నాటి యుద్ధంలోని కోళ్ల పందెంలా రెండింటికీ వీర పోటీ సాగుతోంది.

నా గొర్రె ఓడిపోతే సర్పంచ్ గిరి వదిలేస్తా అని రాజుగారు, నా గొర్రె ఓడిపోతే సర్పంచికి పాలేరుగా వుంటానని రెడ్డిగారు- రెండు గంటల నుంచి సాగుతున్న పోటీని ఊరంతా కన్నార్పకుండా చూస్తున్నారు. రెడ్డిగారి గొర్రె నెగ్గుతుంది అని కొంతమంది, రాజుగారి గొర్రె నెగ్గుతుందని కొంత మంది వాళ్లల్లో వాళ్లు పందేలు వేసుకున్నారు. కానీ రెండు గొర్రెలు హఠాత్తుగా ఒకేసారి కింద పడిపోయాయి. ఏమైందో తెలియదు. ఒకటి, రెండు, నిమిషాలు... టైమ్ గడుస్తోంది. ఏ గొర్రె లేవలేదు. ఇక ఉండబట్టలేక పోటీకి ఎగదోసే పోలిగాళ్లు వాటి దగ్గరకెళ్లి చూసారు. రెండు చచ్చిపోయాయ్ ప్రభువా అని కేక వేశారు. కాసేపు ఎవరికీ ఏమీ అర్థం కాలేదు.

ప్రజలు రెండు నిమిషాల్లోనే తేరుకున్నారు. మా గొర్రెకి విషం పెట్టారు. మా గొర్రెకి మందు పెట్టారు అంటూ, మీ గొర్రె చచ్చింది కనుక సర్పంచ్ ఉండడానికి వీల్లేదని వాళ్లు, మీ గొర్రె చచ్చింది కనుక మా సర్పంచ్‌కి పాలేళ్లుగా వుండండి అని వీళ్లు చేతిల్లో వున్న కర్రలతో ఒకళ్లని ఒకళ్లు కొట్టుకోవడం మొదలుపెట్టారు.


పోలీసు పటేలు, ఊళ్లో వున్న పెద్దలు ఇరు వర్గాల వారిని విడదీసేసరికి వాళ్ల తాతలు దిగి వచ్చారు. ఎప్పుడూ సరదాగా సాగే ఈ పోటీలు చివరికి సీరియస్‌గా మారడంతో ఎవరికి వాళ్లే కక్షలతో భీష్మించుకు కూర్చుని సర్పంచ్ పదవి మాది అంటే మాదని వాదులాడుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఊళ్లో పెద్దలు, పోలీసుపటేలు కలిసి వేదాంతవేద్యుడు, పంచాంగ కర్త, ముహుర్తాలు పెట్టడంలో దిట్ట అయిన సత్యంగారి దగ్గరకు వెళ్లి మొత్తం కథ చెప్పారు.

ఆయన సాంతం విని, అయితే వేరే వార్ని ఊరి ప్రెసిడెంట్‌గా చేస్తే సరి, ఇద్దరితో గొడవ వుండదు. అని లోపలకి ఇంట్లోకి చూస్తూ ''చిన వెంకట శాస్త్రీ వచ్చిన వాళ్లకు మంచినీళ్లు ఇయ్యామ్మా'' అన్నారు.

మంచినీళ్లు తెచ్చిన శాస్త్రిని చూసిన ఊరిపెద్దలు, అతని మొఖంలో వర్చస్సును చూసి అబ్బురపడ్డారు. నుదుటున నామాలు, చక్కటి రూపం, నిజంగా వెంకటాపతే అనుకున్నారు. ''ఇతనే ఈ ఊరి ప్రెసిడెంట్'' పెద్దల్లో ఒకరిగా వచ్చిన ఆ ఊరి పూజారి అన్న మాటలకు మిగిలిన పెద్దలు మౌనమే అంగీకారంగా తలలు ఊపారు. ఏమంటారు అన్నట్లు సత్యంగారి కేసి చూశారు.

కుర్రాడి జాతకం తెలిసిన సత్యంగారు నవ్వుతూ తల ఊపారు. ఈ హఠాత్ పరిణామానికి చినవెంకట శాస్త్రి నివ్వెరపోయాడు. ఊరిపెద్దలు ఎలా చెప్పి ఒప్పించారో ఏమోగాని, మరుసటి రోజే రచ్చబండ మీద పంచాయితీ జరిపి ఏకగ్రీవంగా చినవెంకట శాస్త్రిని ప్రెసిడెంట్ చేసేసారు.


మేలిమి బంగారం లాంటి భార్య పద్మావతి. భార్య రూపం, అతని రూపం కలిసి పుట్టిన రెండేళ్ల పాప 'శిరి', పెద్దతోట మధ్యలో ఎత్తు అరుగుల పెద్ద బంగ్లాలాంటి ఇల్లు, వంద ఎకరాల మాగాణి, ఆది దంపతుల్లాంటి తల్లి, తండ్రి, వేదఘోషతో మారు మ్రోగే ఇల్లు. ఇప్పటి వరకు- ఇదీ చినవెంకట శాస్త్రి పెరిగిన వాతావరణం. అలాంటిది హఠాత్తుగా వేడెక్కిన ఊరి రాజకీయాల్లోకి అనుకోకుండా వచ్చిపడ్డాడు. ఊళ్లో వాళ్లు అతనికి ఎందుకు పదవి కట్టబెట్టారో,



దానికి తండ్రి ఎందుకు ఒప్పుకున్నాడో అర్థం కాని అయోమయంలో రెండు మూడు నెలలు గడిపినా, తొందరలోనే ఆ పదవికి వన్నె తేవడం మొదలు పెట్టాడు.

టౌన్ నుంచి కిరోసిన్ తెప్పించి వీధి స్తంభాలు ఏర్పాటు చేసి, కరెంటు లేని ఆ ఊళ్లో కిరోసిన్ వీధి దీపాలు ఏర్పాటు చేశాడు. చెరువు తవ్వించాడు. ఎలిమెంటరీ స్కూల్ వరకు ఉన్న పాఠశాలని హైస్కూలు చేశాడు. ఇలా ఒకటేమిటి ఊరికి ఏదో ఒకటి చేస్తూనే వుండేవాడు.

అన్నిటి కన్నా ముఖ్యమైనది. రెండువందల సంవత్సరాల క్రితం కట్టిన అమ్మవారి గుడిని బాగు చేయించి నిత్యపూజలు జరిగేలా చూశాడు. విశ్వ ప్రయత్నం మీద ఊళ్లో వారిచేత పందాలు కట్టడం మానిపించాడు. అపరాలు, కూరలు, పాలు టౌన్‌కి పంపి వ్యాపారం చేయించాడు. పశువులకి, మనుషులకి వేరు వేరుగా రెండు దోనెలని ఏర్పాటు చేశాడు.




ఒకప్పుడు ఒక్కడూ వెళ్లి అన్ని పనులూ చక్కబెట్టుకొచ్చే శాస్త్రి వెనకాల ఇప్పుడు కనీసం 40-50 మంది వుంటారు. హార్థికంగా, ఆర్థికంగా ఉన్నవాడు కావడంతో పంచాయితీలో వచ్చిన ప్రతి పైసా గ్రామానికే ఖర్చుపెట్టేవాడు. శాస్త్రి వీధిలో నడుస్తూంటే అతని కంటే చిన్నవాళ్లూ, పెద్ద వాళ్లు కూడా చెయ్యెత్తి నమస్కారం పెట్టేవారు.

మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు శాస్త్రి. సగం ఆస్తి ఇచ్చి కూతురి పెళ్లి ఘనంగా చేశాక కొన్ని సంవత్సరాలకే తల్లీ తండ్రి కాలం చేశారు. ఇంట్లో ఏమీ తోచని శాస్త్రి ఎక్కువ సేపు రచ్చబండ మీద రాజకీయాల్లో గడిపేవాడు. ఈ పరిస్థితుల్లోనే సడన్గా ఒకరోజు దసరాల్లో అమ్మవారికి ఉత్సవాలు చెయ్యాలని అనిపించింది శాస్త్రికి. వెంటనే అనుకున్న తడవుగా దసరా ఉత్సవాలు మొదలయ్యాయి. ఉత్సవాల్లో భోగం వాళ్ల డ్యాన్సులు, బాణసంచా ఉండాలని పట్టుపట్టిన ఊరివాళ్ల కోరిక కాదనలేకపోయారు.

ఉత్సవాలు ముగిశాక హరికథల వాళ్లకి, బుర్ర కథల వాళ్లకి, పెట్రోమాక్స్ లైట్లకు, ఇలా ఒక్కొక్క ప్రోగ్రామ్‌కి గుమాస్తా గుర్నాథం లెక్కలు కడుతుంటే శాస్త్రిగారు డబ్బులు ఇస్తున్నారు.

ఆఖర్న గుళ్లో నాట్యం చేసింది మందాకిని అని. ఆవిడ రావడానికి ఖాళీ లేదుట. కూతుర్ని పంపింది. డబ్బులు ఇవ్వండి అంటూ గుర్నాథం అన్న మాట



# కోదండ రామిరెడ్డి టీవీ రంగ ప్రవేశం

**ఒ**కప్పటి స్టార్ డైరెక్టర్, ఇప్పుడు కొద్దో గొప్పో నిర్మాత అయిన ఎ. కోదండ రామిరెడ్డి సరికొత్తగా బుల్లితెరను కూడ ఓ చూపు చూడబోతున్నారు. భక్తి ప్రధానమయిన 'పురాణ గాథలు'ను టీవీ కోసం చిత్రీకరిస్తున్నారు. తొమ్మిది వందల ఎపిసోడ్స్‌గా రూపొందుతున్న ఈ సీరియల్, ఏప్రిల్ 6వ తేదీ నుంచి డెలీ సీరియల్‌గా ప్రసారం కానుంది. ఈ గాథలను రూపొందించడంలో ఆయన పురాణ ప్రముఖుల్ని, పండితుల్ని, మత బోధకుల్ని చాలా మందిని కలుసుకుని, వారి సలహా సంప్రదింపులు తీసుకున్నారు. అదలా ఉండగా, ఈ గాథల చిత్రీకరణ కోసం నగర శివార్లలో 10 లక్షల ఖర్చుతో కోదండ రామిరెడ్డిగారు సెట్స్ కూడ వేశారు. ఏదేమయినా ఆయన స్టైలే వేరు!!

లకి శాస్త్రిగారు యథాలాపంగా తల పైకెత్తి ఆ పిల్ల కేసి చూసిన ఆయన కళ్లు రెప్ప వేయడం మరిచిపోయారు. ఏమందం ఈ పిల్లది. 16 ఏళ్లు ఉంటాయేమో... పెద్ద పెద్ద కళ్లు, ఉంగరాల జుట్టు, పచ్చని శరీర ఛాయ, చక్కటి ఎత్తు, పచ్చని పట్టులంగా, ఎర్రని ఓణి, బంగారపు రాశి పోసినట్లుంది.

ఎలాగోలా మనస్సుని సరిపెట్టుకొని డబ్బులిచ్చి ఆ అమ్మాయిని పంపినా, కళ్లల్లో గూడుకట్టుకొని వదలని ఆమె రూపం, ఆ పిల్ల ఇల్లు వెతికి పట్టుకొని ఆమె ఇంటికి వెళ్లేలా చేసింది. ఎంతటి వాళ్లనైనా కాలం మారుస్తుందేమో. నారదుడు లాంటి బ్రహ్మచారిని స్త్రీరూపంలో విష్ణుమాయ కట్టిపడేసింది కదా! రాజకీయాలు, స్త్రీ, ఎంత అందలం ఎక్కిస్తాయో అంతలా దిగజారుస్తాయి. ప్రవరాఖ్యుడు లాంటి చిన వెంకట శాస్త్రిని గుమ్మంలో చూడగానే ఖంగుతింది మందాకిని. (కాని వెంటనే వాళ్ల అమ్మమ్మ చెప్పిన విప్రనారాయణ కథ గుర్తుకొచ్చి నవ్వుకుంది)

"రండి... దొరవారూ...రండి" అంటూ హడావిడిగా ఆహ్వానించింది. తూగుటుయ్యాలలో కూర్చోబెట్టింది. దొడ్లో పని చేస్తున్న రంగడిని పిలిచి విసనకర్రతో విసరమంది. గబగబా వంటగదిలోకి వెళ్లి పచ్చ కర్పూరం, ఏలకులు, సుగంధద్రవ్యాలు మిళితం చేసి, అప్పుడే తీసిన ఆవుపాలు కాచి వెండి చెంబులో పోసి కుడి అరచేతిలో తన పమిటకొంగు వేసుకొని దానిపై వేడి పాల చెంబు పెట్టుకొని, "తీసుకోండి దొరా" అంటూ చెంబు అందించింది.

ఆయన కుడిచేతిని ముందుకి చాపి పాలు అందుకొంటూ,"ఏది నీకూతురు" అన్నారు.

అడక్కుండానే అన్నీ చెప్పే అలవాటున్న మందాకిని– పేరు నీలాకృష్ణ దొరా. పిఠాపురం జమీందారు పది ఎకరాలతో కన్నెరికానికి సిద్ధంగా వున్నారు అంటూ ఏదో చెప్పబోతోంది. ఆమె మాటల్ని మధ్యలోనే ఆపిన శాస్త్రి నేను 15 ఇస్తాను. సిద్ధంకండి అంటూ బయటకి వచ్చేశారు.

నాలుగో సారి కూడా మళ్లీ శాస్త్రే ప్రెసిడెంటు అయ్యాడు. కాని శాస్త్రిలో అనుమానం మొదలయింది. ప్రజలు తనకి పూర్వం అంత గౌరవం ఇవ్వట్లేదేమోనని. తప్పు చేస్తున్నాను అనే భావం మనిషిలో ఆత్మన్యూనతా భావాన్ని పెంచుతుంది. చేసిన తప్పుని సరిదిద్దుకుంటే మహానుభావుడు అవుతాడు. లేకపోతే అట్టడుగుకి దిగజారిపోతాడు. రాజకీయంగా ఎదుగుతున్న వాడ్ని చూడలేక ఏ తప్పు చేస్తాడా, వీడి కుర్చీ ఎప్పుడు లాగేద్దామా అనే వాళ్లు ఇప్పుడే కాదు అప్పుడూ వున్నారు.

మందాకిని జాణ. శాస్త్రి ఆస్తిని, గౌరవాన్ని కర్పూరంలా కరిగించేసింది. పన్ను రూపంలో పంచాయితీకి వచ్చిన డబ్బు కూడా మాయం అయింది అనే విషయం ఊరంతా గుప్పుమంది. పదవిపోయి, రచ్చబండ ముందు నుంచోవలసి వస్తుందోమోనని భయపడి శాస్త్రి రాత్రికి రాత్రే పెద రెడ్డిగార్కి ఇల్లు అమ్మేసి పంచాయితీ డబ్బు కట్టేశాడు.

తెల్లవారితే ఎక్కడుండాలి? మహావిష్ణువు లాంటి భర్త కుచేలుడులా అయిపోయాడనే దిగులుతో ఇల్లు ఖాళీ చేయకుండానే ఇల్లాలు పద్మావతి గుండె ఆగిపోయింది. మీ నాన్నను కనుక నీతో తెచ్చే మాటయితే నువ్వు మళ్లీ మా గడప తొక్కవద్దు అని చెప్పారు అత్తమామలు. నా భర్త, నేనూ మీకు అండగా మీతోనే వుంటాను. అని తల్లి మరణవార్త తెలిసి వచ్చిన 'శిరి' తడి కళ్లతో తండ్రితో చెప్పింది.

"వద్దు, తల్లీ వద్దు. ఆరిపోయే దీపం కోసం నీ భవిష్యత్తు పాడుచేసుకోవద్దు. అయినా ఈ పరిస్థితుల్లో నా పొట్ట గడవడమే కష్టం" అని చెప్పి కూతుర్ని బలవంతంగా అత్తవారింటికి పంపేశాక, పెదరెడ్డికి ఇల్లు అప్పజెప్పి తను కట్టించిన సత్రం అరుగు మీదే శేష జీవితం గడిపి కన్ను మూశాడు. ఎవరన్నా పెడితే తినేవాడు లేకపోతే లేదు. ఆరోజుల్లో ఆడపిల్లలకి స్వాతంత్ర్యం లేదు. శాస్త్రి బతికి వుండగా రెండుసార్లు అనుకుంటా శిరి తండ్రిని చూసి ఏడ్చుకుంటూ వెళ్లిపోయింది. కాని విచిత్రం ఏమిటంటే, ఇంతటి పెద్ద మనిషి ' ఏమండీ..కొబ్బరినూనె పోయండి తలకు రాసుకుంటా' అని చెయ్యిచాచి అడుక్కోవడం నా కళ్లారా చూశాను.

★

